# ద్వైతాద్వైతం

## మొదటి కథ

భగవంతుణ్ణి నిర్లక్ష్యం చేసి నేను చాలాకాలం తిరిగేను. ఆయన ఉన్నాడనే విషయమే నేను దాదాపు మర్చిపోయేను. కాని,

ఓసారి -

నేను చచ్చిపోతాననుకున్నాను.

మధ్యాహ్నం,

మండుటెండ,

ఎటుచూసినా చావే! పక్షులు రాలి చచ్చేయి, పాములు మాడిచచ్చేయి, ఎలుకలు ఎండి చచ్చేయి, ఏనుగులు కూలి చచ్చేయి, చెరువుల్లో చేపలు ఊపిరాడక కొట్టుకు చచ్చేయి, గోవులేమిటి, గేదెలేమిటి అన్నీ కూడా అంబా అని పిలుపులేక చచ్చేయి. మనుషులంతా ఇక్కడికీ, అక్కడికీ వలసపోయి చచ్చేరు; వలసపోతూ చచ్చేరు; వలసపోకుండా కూడా చచ్చేరు. గడ్డిగాదా చచ్చింది; మొక్కా మోడీ చచ్చింది, నూతులా గోతులా నరులా గిరులా - అన్నీ కూడా ఉడికుడికి ఊపిరి మిగలక ఎండి చచ్చేయి, అడవులన్నీ ఎండి కాలి మండి మాడిమసయి చచ్చేయి, బోడిగా భయంకరంగా కొండలు మాత్రం మిగిలిపోయేయి. అవైనా కదలకుండా, మెదలకుండా పగలల్లా అందర్లాగే చచ్చినట్టే ఉన్నప్పటికీ, కడుపులనిండా నిప్పుల కుప్పలు దాచుకున్న దొంగ రాక్షసులలాగ రాత్రివేళల్లో సెగలు, పెనుసెగలు చిమ్మేవి.

అయితే, మొదట్లో నేనంత ఇబ్బందేమీ పడలేదు. ఎవరెలా పోయి ఏమైపోయినప్పటికీ నాకు మాత్రం ఎక్కడా తిరుగుండేది కాదు. ఆయేడే నేను మా ఆవిడ్ని తెచ్చుకున్నాను కూడాను. ఈ విశ్వం అంతా మాదే అన్నట్టుగా మేం స్వైర విహారం చేసేవాళ్లం. మా పాలిట అమృతమే ఆ కాలం.

కాని, కాలకూట విషం అందులోకి ప్రవేశిస్తోంది అని మేం తెలుసుకోలేక పోయేం. మరో వర్షాకాలం వస్తుంది, మరింక అంతా చక్కబడుతుందనుకున్నాం, అయితే -

వర్షం రావలసిన కాలం వచ్చిందే కాని వర్షం మాత్రం రాలేదు. జంతువు గోతిలో పడ్డప్పుడు దాని ఆశలన్నీ ఆకాశంలోకి ఎగిరిపోయినట్టు ఆకాశంలోని మబ్బులన్నీ ఎక్కడ కెగిరిపోయాయో కాని మాయమయిపోయేయి. ఒక్క మేఘపు ముక్కయినా లేని ఆకాశం ఎంత భయంకరంగా ఉంటుందో నాకు తెలుసు. కాని చచ్చిన అడవి బూడిదలోంచి ఆ అడవిని

కాల్చి చంపిన మంటి ముద్దలాగ సూర్యుడు లోకం నెత్తిమీంచి ప్రళయ భయంకరంగా నడుచుకు పోతుండేవాడు. రాత్రయింది. ఈ రాక్షసుడు మరింక రేపటివరకూ రాడుగదా అనుకొని మర్చిపోడానికైనా వీల్లేకుండా చంద్రుడూ, చుక్కలూ వాడి జ్ఞాపకాల్లాగే వేధించేవి. మండితే మంచి గంధపు చెక్కయినా నిప్పే అయినట్టు గడ్డు దినాల్లో మంచి కూడా చెడ్డగానే మారిపోతుంది.

అయితే ఉన్నమాట చెప్పాలి. ఆకల్తో చాలామంది చచ్చేరు. కాని నేనూ మా ఆవిడా, మా పిల్లలూ మాత్రం తిండికి ఇబ్బంది పడలేదు. అవును అప్పటికి మాకు ఇద్దరు పిల్లలు, కవలలు - ఇద్దరూ మగపిల్లలే వాళ్ళిద్దర్నీ అన్నా, చిన్నా అని పిల్చుకునే వాళ్ళం. గొప్ప పుటక పుట్టినందుకు వాళ్లు బంగారపు బంతుల్లా మెరుస్తూ ఆడుకొంటుంటే నేనూ సంతోషిస్తూ మైమరచిపోయేవాణ్ని. మా ఆవిడ వాళ్ళని గర్వంగా చూచుకొంటూ మెత్తగా మృదువుగా నా ప్రక్కన కూర్చునేది. పిల్లల్లో అంత స్వర్గం ఉంటుందని అంతకు ముందెన్నడూ నేననుకోలేదు కాని .

అంతలోనే నరకం అంతా ఒక్కసారిగా మామీదికి దిగిపోతుందని కూడా నేననుకోలేదు. అంతా అయిపోయేదాకా పీకలమీదకి కత్తొచ్చేదాకా నేను కానుకున్నాను కాను. గుండెల్లో గుచ్చుకోనేదాకా బాణం వస్తోందని తెలియనట్టు, రాత్రివేళ ముంచేసేదాకా ముంపొస్తోందని తెలియనట్టు, అంతా అయిపోయిందని తెలిసేదాకా నీరయిపోయిందని మేం తెలుసుకోలేక పోయేం. దాహం దాహం.

నోరెండిపోతోంది, దాహం. తడిగా ఉంది నీరులేదు, దాహం. నీరెండైనా లేదు, దాహం. నాలుక రాయిగా మారిపోతోంది, దాహం. నరాలు తోడేస్తున్నాయి, దాహం. కళ్ళ నిండా కారాలు అంధకారాలు దాహం. కడుపులో నిప్పులు, గుండెల్లో మంటలు దాహం దాహం.

ఆ బాధని నేను సరిగా వర్ణించలేను, ఈ లోకం ఈ సంసారం ఈ జీవితం అంతా అబద్ధం, నీరే ప్రాణం. అదే నిత్యం సత్యం అనిపించింది నాకు. దాహం సమస్య తప్ప నాకు మరో సమస్యేదీ బతుకుతో ఉన్నదనిపించలేదు. ఓ చుక్కనీటి కోసం భూమిని నిలువునా చీరేసి చంపేస్తే నేను బాధపడి వుండేవాణ్ని కాను. ఆకాశపు నీలంలోంచి నాలుగు నీటి బొట్లయినా సరే ఏ దేవుడో ఓ దేవుడు పిండి తెచ్చి నాకు ప్రసాదిస్తే జన్మజన్మలకీ కృతజ్ఞుణ్నయి ఉందునుకదా అనిపించింది నాకు. గాలి చంపుతోంది, దూళి చంపుతోంది, నేల చంపుతోంది, నింగి చంపుతోంది. నా నాలిక, నా గొంతుక, నా నెత్తురు, నా నవనాళ్ళు అన్నీ చంపేస్తున్నాయి.

.ాది ఇనప గుండె. నేను దేనికీ భయపడను. పాపకృత్యాలని ఎవరైనా అంటే అనవచ్చుసమో, కాని నా బతుకు కోసం నేనెన్నెన్నో ధైర్యమైన పనులు చేసేను. ఎలుకని పిల్లీ, పిల్లిని కుక్కా, దాని ఇంకొకరూ తినేట్టు దేముడే చేసినప్పుడు, నేను నా ప్రాణం నిలబెట్టుకొందికి ఏం చేసినప్పటికీ అందులో తప్పేంలేదు. భగవంతుడిచ్చిన, ఆయన నా కేర్పాటుచేసిన బతుకు బతకడంలోనే నేను కాలం గడిపేను. భగవంతుడి గురించి ఎక్కువసేపు ఆలోచించవలసిన అవసరంకాని, అతణ్ని ప్రార్థించవలసిన అగత్యం కాని నాకెన్నడూ అప్పటివరకూ కలగలేదు.

కాని. ఆవేళ నా శక్తి సన్నగిలిపోయింది. నా పిల్లల్లో ముందువాడు గిజగిజ కొట్టుకుని నా కళ్ళ ముందే ఆరిపోయాడు. మా చిన్నవాణ్ని నా భుజాలమీద వేసుకొని మా ఆవిణ్ని వెంటవేసుకొని నీటికోసం ముల్లోకాలైనా సరే గాలిద్దాం అనే పట్టుదలతో బయల్దేరేన్నేను. కొండలెక్కేను, గుట్టలెక్కేను, అడవులన్నీ గాలించేను. మూడు రోజుల్లోనే అలిసిపోయేను. మా ఆవిడ కదలలేక సోలిపోయి పడిపోయింది. మా చిన్నవాణ్ని నేను మొయ్యలేక వాణ్ని కిందకి జార్చేసేను. నేను వగర్చుకుంటూ నిలబడిపోయేను. ఎదురుగా నాకు ఎండా ఇసకా తప్ప ఇంకేమీ కనిపించలేదు. మా చిన్నవాడు ఏమయ్యేడు? మా ఆవిడ ఏమయింది? బ్రతికి ఉన్నారా? ఏమో నేను చూళ్ళేను. దేముడి దయుంటే బతుకుతారు? లేక .... ....

దేముడు! ఆ దినం, ఆ మధ్యాహ్నం ఆ విధంగా అకస్మాత్తుగా భగవంతుడు నాకు తలపు కొచ్చేడు. ఆయన్ని ఆ విధంగా తల్చుకునేందుకు ఆయనే అదంతా ఏర్పాటు చేసుండాలి! అంతవరకు ఆయన్ని తలచనందుకు నేను పశ్చాత్తాపంతో తడిసిపోయేను. అన్యథా శరణం నాస్తి అనుకొని పాప పరిహారార్థం నా గోళ్ళతో నన్ను రక్కేసుకొని రక్తాలు కారుతూండగా ఒంటికాలిమీద నిలబడి ఆ దీనజన బాంధవుణ్ని నేను తీవ్రాతి తీవ్రంగా ఘోరాతి ఘోరంగా ప్రార్థించేను.

అలా ప్రార్థిస్తూండగా అకస్మాత్తుగా ఆ మధ్యాహ్నపు మండుటెండలో, మసకలు కమ్మి చీకటితో నిండుకుపోయిన నా కళ్ళకి భగవంతుడు మెరుపులా, నిప్పులా, వెలుగులా, జ్యోతిలా, చిచ్చులా, చీకటిలా, మబ్బులా, పిడుగులా కనిపించేడు. నల్లగానా, తెల్లగానా, ఆకాశపు రంగులానా, అరుణోదయంలానా, మంచుకొండలాగా అగ్నిపర్వతంలాగా? - ఎలా ఉన్నాడతను, ఆయన అన్ని రంగుల్లోనూ ఉన్నాడు. అన్ని రూపాల్లోనూ ఉన్నాడు. నిశ్చలంగానూ ఉన్నాడు. క్షణక్షణానికి మారుతూనూ ఉన్నాడు. ఆ సమయంలో నేను భయంతో గజగజలాడేను. భక్తితో వజవజ వణికేను. సంతోషంతో ఉప్పొంగిపోయేను.

ఈ ఎండమంటలు, ఈ మంటగాలులు ఈ ఆకటి కేకలు, ఈ దాహపు ముల్లులు, ఈ నిప్పుల వానలు ఇవన్నీ ఎందుకోసం కల్పించేవు దేవా? ఇందుకేనా? చలించని నా ఇనపగుండె, తిరుగెరుగని నా ఉక్కుదెబ్బ, వజ్ర సమానమైన నా లోహదేహం, ప్రళయ భీకరమైనప్పటికీ అతి మనోహరమైన నా సుందర రూపం, వీటితో నాకంటె ఎక్కువ్వాడు లేనే లేడని రాజుగా, రారాజుగా, మదోన్మత్తుడిగా, మదాంధుడిగా, దుష్టుడిగా, దురహంకారిగా విచ్చలవిడిగా చరించే నాకు బుద్ధి చెప్పాలనేనా? నా శక్తియినా, ఏ శక్తయినా నీ శక్తికి మించదనీ, నీ శక్తికి లోకువేనని నిరూపించడానికేనా ఇదంతా కల్పించేవు? దేవ దేవా నాకు బుద్ధొచ్చింది తెలివొచ్చింది. ఈ చిన్న లోకంలో నేనెక్కువ్వాణ్ణే కాని ఈ విశ్వంలో నేనెంతవాణ్ని!? ఈ చిన్నలోకంలో నేను నగధీరుణ్నే, మహా మేరువునే కాని - జగదీశ్వరా - నీ ముందు నేను ధూళిరేణువునే కదా! పరమేశ్వరా, ఈ పాపాత్ముణ్ని క్షమించు, ఈ వాతలు, ఈ కాల్పులు, ఈ కష్టాలు, ఈ కఠోర పరీక్షలు, ఈ కఠిన శిక్షలు చాలు నాకిక చాలు. నీ ముందు నాకు గొప్పలేదు. గర్వంలేదు. నీ ముందు నేను దీనుణ్ని, హీనుణ్ని, క్షుద్రుడ్ని. ఈ తనువు నాదే అనుకున్నాను. కాదు! అది నీదే, నీవిచ్చినదే. నేను నావాణ్ని కాను, నీవాణ్నే. నా రాణి నాకు భార్యే. లోకానికి రాణే కాని నీకు మాత్రం దాసురాలు. భగవాన్ మమ్మల్ని రక్షించు సకల

భోగభాగ్యాలూ అనుభవించిన మేం నీకు దాసానుదాసులం, నీ పాదధూళి రేణువులం, మేం దిక్కులేకుండా ఉన్నాం. మేం దీనులం, దౌర్భాగ్యులం, నీవు తప్ప మాకు వేరే దిక్కులేదు. దారిలేదు. దారి, దిక్కు, నీరులేదు. నీరు, దిక్కు, దారిలేదు. నా దిక్కు, నీ దిక్కు దారి దిక్కు నీరు దారి నీరునీరు నీవునీరు ....

క్షణమా? యుగమా?

అదే భగవంతుడి గొప్పతనం. క్షణాలు యుగాలవుతాయి. యుగాలు క్షణంలో సగాలవుతాయి. నీరు గాలవుతుంది. గాలి నీరవుతుంది. కొండలు మంచులా కరిగిపోతాయి. మంచుముద్దలు కొండ కొండలుగా ఎదిగిపోతాయి. ఆ సర్వశక్తి సంపన్నుడు ఏది తల్చుకుంటే అది చెయ్యగలడు. ఆయన చేయలేని దేముంది?

క్షణమో యుగమో అయేక కళ్ళు తెరిచేను.

ఎత్తుగా ఉన్న ఓ చోట ఓ బండరాయి పక్క నిల్చుని ఉన్నాన్నేను. కనుచూపు దూరంలో ఉత్తరం నుంచి దక్షిణం వైపుకి ఇసుక తిన్నెలు కనిపిస్తున్నాయి. అచ్చట అహో ఏమది?? ఆ ఇసుక తిన్నెలలోంచి ఏమని ఆ పొగలు? కావు సెగలు! కావు! ఆవిర్లు! దూరం నుంచి వచ్చే ఆ వెండితీగెకి పాదరసపు తళుకు ఎక్కణ్నుంచి వచ్చింది? అనతి దూరాన ఆ తిన్నెమీంచి క్రిందికి దిగుతూన్నవి ఏమవి? రెండు చిన్నప్రాణులు. రెండు క్షుద్రజీవులు అవేం చేస్తున్నాయి? దాహం దాహం దాహందాహం తీర్చుకొంటున్నాయా?? భగవాన్ భగవాన్ భగవాన్! ఈ దీనుడు ఈ క్షణంలో ఇక్కడ ఇలా ప్రార్థిస్తాడని తెలిసే అక్కడెక్కడే ఏవో తీరంలో ఏదో దేశంలో - నిన్ననా మొన్ననా? ఏ నీటి మబ్బులలోంచి ఏ మంచు కొండలలోంచి ఈ వర్షాన్ని పుట్టించి నాకోసం ఇక్కడికి తెచ్చేవు? ఈ దౌర్భాగ్యుడి కోసం ఎక్కడ ఏ మేఘాలు కల్పించి, ఏ వర్షాలు కలిగించి ఏ కాల్వలు వేయించి ఎన్ని దూరాలనుంచి ఈ అమృతధార ఇక్కడికి తెచ్చేవు? పరమాత్మా! నేను ధన్యుణ్ని! మేమంతా ధన్యులం! మేమంతా మీ దాసులం, మీ భక్తులం. తరాలు నడిచిపోనీ, యుగాలు దాటిపోనీ! ఏనాటికైనా సరే మేమంతా మీ భక్తులం. మా ప్రాణాలు, మా కుటుంబాలు, మా జీవితాలు, మా రాజ్యాలు అన్నీ మీవే దేవా మీవే! ఏలే రాజాస్యాలన్నీ మీ పేరునే మేం ఏలుతాం! మిమ్మల్ని సర్వదాకొలుస్తాం. నీ సేవచేస్తూ నీవిచ్చిన నీరుతాగి నీవిచ్చేఽకూడు తిని .... దేవా, దేవ దేవుల దేవా, దేవా ...."

అనుకొంటూ పరిగెట్టేన్నేను!

స్నేహితులారా! నా వృత్తాంతం విన్నారా? విన్నారు కద! అందుచేత ఈ సంగతి గుర్తుంచుకోండి! మనం గొప్పవాళ్ళమే, కాదని ఎవరనగలరు? కాని ఆది మధ్యాంత రహితుడు, సర్వశక్తి సంపన్నుడు నిఖిల లోకేశ్వరుడు, రాజరాజేశ్వరుడు భగవంతుడు - ఆయన లేకపోతే మనం ఉండమని గుర్తుంచుకోండి. ఆయన ఇచ్చే రక్షణ లేకపోతే మనం కాదు మన నీడైనా ఈ నేల మీద మిగిలి ఉండబోవని తెలుసుకోండి. తెలిసిందా! తెలిసింది కదా! మన భక్తికి ఆయన పలుకుతాడు! ఆయన గొప్పని మనం ఎల్లప్పుడూ పలకాలి!

## రెండో కథ

నేనూ, మా చెల్లీ ఒక్కనాడే పుట్టేం. మా నాన్న మాకు గుర్తులేరు. ఓ దినం ఉదయం కొంతమంది చుట్టూ చేరి మా నాన్నని నడివీధిలో నిలబెట్టి నరికేసేరుట. ఎందుకు నరికేరో మా అమ్మకి తెలిసినా మాతో చెప్పేది కాదు. అడిగితే కళ్ళంట నీళ్ళు పెట్టుకునేది.

మేం అప్పుడు చాలా చిన్నవాళ్ళం, మా నాన్న అలా కడతేరిపోగానే మా అమ్మ ఆ ఊరిడిచి భయపడి మమ్మల్ని తీసుకొని అడవికి చేరుకొంది (ట) -

అడవి నాకు బాగా గుర్తుంది. ఆకుపచ్చగానూ చాలా చీకటిగానూ ఉండేది. అక్కడక్కడ చీకటి పోగొడుతూ ఆకుల మధ్య నుంచి ఎండల మెరుపులుండేవి. తినాలే కాని కావలసినంత తిండి దొరికేది, ఆడుకొందికి ఉడతలూ, కోతులూ, చిలకలూ, సీతాకోకచిలుకలూ ఎన్నెన్నో ఉండేవి. అడవులలో బతకొచ్చు కాని భయపడుతూ బతకాలి. అంతా బాగుందని అనుకున్నప్పుడు అకస్మాత్తుగా రాక్షసులు మీదపడి మింగేస్తుంటారు. రాత్రివేళలలో నాకు మరీ భయంగా ఉండేది.

అడవిలో మేం ఉండేచోటికి దగ్గర్లో ఓ కొండా దానికి అవతల ఓ వాగూ ఉండడం నాకు బాగా జ్ఞాపకం ఉంది. ఏటికి వెళ్ళాలంటే కొండచుట్టూ తిరిగితే చాలా దూరం, కొండ ఎక్కి దిగితే అది అడ్డుదారి, దగ్గిరదారి.

ఓనాడు మధ్యాహ్నం ఏటికి వెళ్ళడానికి మా చెల్లీ, మా అమ్మా, నేనూ కొండెక్కి రెండోవైపు దిగుతున్నాం. దాదాపు కిందికి దిగేం. మాకు ఎదురుగా కొంత దూరంలో భగభగ లాడుతూ ఇసకతిన్నెలు కనిపిస్తున్నాయి. ఆ వెన్నెల మధ్యలో సన్నగా ఏరు ప్రవహిస్తోంది. ఆకాశంలో ఓ ముక్కని అంచులా కత్తిరించి వంకర వంకరగా వయ్యారంగా నేలమీద పరిచినట్టు ఏటి నీలం కంటికి చల్లగా అందంగా ఉంది. ఏటికి అవతలి గట్టున చెట్లన్నీ దట్టంగా ఉన్నప్పటికీ అవి చచ్చిపోయిన రాక్షసులలాగ చలనం లేకుండా నిలబడున్నాయి. ఎండ చాలా ఉగ్రంగా ఉంది. చల్లారని ఆవిర్లాగ గాలి మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

మేం కొండ దిగుతూండగా చివరి గట్టుమీద మా అమ్మ ఆగిపోయింది. మేం కూడా ఆగేం. మా అమ్మ చూసేవైపు చూసేం.

ఆవలిగట్టున ఉన్నాయవి. కొన్ని వందలున్నాయి. ఆవురావురని నీరు తాగుతున్నాయి. వాటిని చూసి కుక్కలనుకున్నాను. కుక్కలన్నా, నక్కలన్నా నాకు చెడ్డ భయం. కాని అవి కుక్కలూకావు, నక్కలూకావు "తోడేళ్లు!" అని మా చెల్లికీ నాకూ చెవిలో ఊదింది మా అమ్మ. అవి చాలా చెడ్డ రాక్షసులని మాకు వెంటనే అర్థం అయిపోయింది. మేం పున్నవైపుని వాటిని మేం ఎప్పుడూ చూడలేదు. ఎక్కడో దూరదేశాల నుంచి దాహం తీర్చుకొందికి అవి వచ్చుంటాయని మా అమ్మ మాకు తెలియజేసింది.

మా అమ్మా, మేమూ నక్కి నక్కి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయేం.

మాకు దాహం వేస్తోంది. అలా ఎంతోసేపు తిరిగేం, ఎక్కడా నీరు దొరకలేదు. మధ్యాహ్నం బాగా ముదిరింది. మేం అలా వెళ్ళగా వెళ్ళగా ఓ చోట ఓ మర్రిచెట్టు కింద కొంతమంది బాటసార్లు పడుకొని మాకు కనిపించేరు. వాళ్ళు బాగా అలిసిపోయి నిద్రపోతున్నారు.

చెట్టువార వాళ్ళ సామాన్లన్నీ భద్రంగా ఉన్నాయి. వాటికి కాపలాగా కూర్చున్న ఒకాయన కూర్చునే నిద్రపోతున్నాడు. ఆ సామాన్లలో రెండు చక్కటి కుండలున్నాయి. ఆ కుండలకి మూతలు లేవు. రెండు కుండలమీదా కొన్ని కాకులు కూర్చుని చడీచప్పుడూ చెయ్యకుండా నీరు తాగుతున్నాయి. ఆ కుండల చుట్టూ మరికొన్ని కాకులున్నాయి. తాగినవి కుండలమీంచి దిగేక తాగనివి కుండలెక్కుతున్నాయి. అవి చాలా కలిసికట్టుగానూ, టక్కరితనంతోనూ వ్యవహరిస్తున్నాయి. వాటి చాకచక్యం చూసి నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

మా అమ్మ మమ్మల్ని వెంటవేసుకొని పిల్లిలా ముందుకు నడిచింది. మేం వెళ్ళి కుండలలో నీరు గబగబ తాగేం, కాకులు సాధారణంగా అటువంటి పరిస్థితులలో అరిచి అల్లరి చేస్తాయి. కాని అల్లరి చేస్తే బాటసార్లు లేస్తారు. లేస్తే మాకూ నీరుండదు, కాకులకూ నీరుండదు. అందుచేతే ఆ కాకులు మమ్మల్ని అరవకుండానే చాలా అల్లరి చేసేయి. ఆవేళప్పుడు మేం యమదూతలొచ్చి అల్లరి చేసినప్పటికీ లక్ష్యపెట్టే పరిస్థితిలో లేం. అందుచేత వాటి అల్లరి లెక్కచెయ్యకుండా కొంత నీరు తాగి అక్కణ్నించి పారిపోయివచ్చి "హమ్మయ్య" అనుకున్నాం.

బాటసార్లని బట్టి, ఆ దగ్గర్లో ఏదో ఊరు వుండి వుండాలని మా అమ్మ గ్రహించింది. ఊరంటూ ఉంటే నూతులో, ఏతాం గోతులో, చెరువులో ఏవో ఉంటాయి కాబట్టి అక్కడికి వెళ్లాం అంది మా అమ్మ.

ఊరంటే మాకు చాలా భయమే. అయినప్పటికీ చెల్లికీ, నాకూ ఊరు చూస్తాం అనేసరికి చాలా ఉత్సాహం వచ్చింది.

ఉదయసంధ్యలో మేం ఆ ఊరు చూసి చాలా ముగ్ధులం అయిపోయేం. ఊరి మధ్య ఓ పెద్ద కొండలాంటిది వుంది. నేను చూసిన కొండలకంటె చాలా చిన్నదయినప్పటికి అది వాటికంటె అందంగా వుంది. దాన్ని దేవాలయం అంటారని మా అమ్మ చెప్పింది. ఆ దేవాలయానికి స్వంత పిల్లల్లాగ దానిచుట్టూ - మేడలట - మంచి మంచి రంగుల మేడలున్నాయి. ఆ మేడలకి ఎడంగా వాటి చుట్టూ వాటి బీద బానిసల్లాగ పాకలుట - చిన్న చిన్న పాకలున్నాయి. ఊరిచుట్టూ భూమికి ఎన్నెన్నో గట్లు వేసేరు. భూమంతా ఎండకి మాడిపోయింది. ఊరి మధ్య చాలాచోట్ల జడలు పెంచిన ఋషుల్లాగా కొబ్బరిచెట్లు కనిపిస్తున్నాయి.

దేవాలయం అంటారు ఈ కొండని అని మా అమ్మ చెప్పగానే "అంటే ఏమిటి" మా చెల్లి అడిగింది. ఆలయంలో దేముడుంటాడనీ, అతను అందర్నీ పుట్టిస్తాడనీ, అందర్నీ రక్షిస్తాడంటారనీ మా అమ్మ చెప్పేసరికి మా చెల్లిలో ఓ విధమైన మార్పొచ్చింది. నేనూ, మా అమ్మ నలుపుకాని అది చాలా తెలుపు. మా అమ్మ దేముడి గురించి చెప్తుంటే దాని తెల్లటి ముఖంలో నల్లటి కళ్ళు మిలమిల మెరిసేయి.

మేం నెమ్మదిగా ఊరివైపు నడిచేం దేముడి గుడిని దగ్గరగా వెళ్ళి చూసేం. చూస్తే గుడి గోపురం ఎంతో సొగసుగా వుంది. గుడి సొగసులన్నీ కనిపించేయి కానీ గుళ్ళో దేముడు మాత్రం మాకు కనిపించలేదు. లోనికి మమ్మల్ని వెళ్ళనిచ్చేరు కారు.

గుడికి చాలామంది జనం వస్తూ పోతున్నారు. వాళ్ళంతా దేముడికి జయజయ ధ్వానాలు చేస్తూ దండాలు పెడుతూ, మధ్య మధ్య మోకరిల్లుతూ చాలా ఉత్సాహంగా

కనిపించేరు. కొద్దిమంది ఏ కేకలూ వెయ్యకుండా చేతులు ముకుళించి కళ్ళంట నీరు కారుస్తూ లోనికి వెళ్తున్నారు. గుడి బైట - ముష్టివాళ్ళుట చాలామంది ముష్టివాళ్ళున్నారు. కళ్లు లేనివాళ్లూ, వేళ్లు లేనివాళ్లూ, కాళ్ళూ చేతులూ లేనివాళ్లూ అక్కడ చాలామందున్నారు. భక్తులంతా వాళ్ళకి రాగి డబ్బులుట, విసురుతున్నారు. ఆ డబ్బుల కోసం వాళ్ళు కొట్టుకొంటున్నారు.

మా అమ్మా, నేనూ ముందుకి నడిచేం, నాలుగడుగులు వెళ్ళేం. మాతో మాచెల్లి మాత్రం లేదు. అమ్మా, నేనూ గాభరాపడి వెనక్కి చూసేం. అక్కడ మా చెల్లి గుడికి ఎదురుగా మోకరిల్లి తల నేలకి అన్చి ఉండిపోయింది. నేను చాలా ఆశ్చర్యపోయేను. మా అమ్మ దాని దగ్గిరికి వెళ్ళి దాన్ని లేవనెత్తుతూంటే ఓ బైరాగిగారు మా చెల్లిని నాకంటే ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయేరు. ఆయన్ని బైరాగిగారంటారని ఆ తరువాత నాకు తెలిసింది.

గుడి దగ్గర్నించి మా చెల్లి, మా అమ్మా, నేనూ గుడివెనక ఉన్న నదికి వెళ్ళేం. నదిలో నీరు నేను అదివరకు చూసిన ఏటిలో కంటె ఎక్కువే ఉంది కాని నది వైశాల్యానికి తగినట్టుగా లేదు. అడవిలో ఆకుల్లాగా నది దగ్గర చాలా ఎక్కువ జనం ఉన్నారు. నీరున్నచోట ప్రాణం ఉంటుందనీ, ఆ నీరు తగ్గుతూన్నకొద్దీ దాని కోసం ఆరాటాలూ, ఆగచాట్లూ ఎక్కువవుతాయనీ నేనప్పుడు తెలుసుకున్నాను.

మేం నదిలో నీరు తాగుతూంటే మా చెల్లి నదిలో శుభ్రంగా స్నానం చేసింది. స్నానం చేస్తూంటే ఆ బైరాగిగారు కూడా అక్కడ ఉండి దానివైపు వింతగా చూడ్డం నేను చూసేను. స్నానం చేసేక మాచెల్లి మళ్ళీ గుడికేసి నడిచింది. అమ్మా, నేనూ కూడా దానివెనకే వెళ్ళేం. బైరాగిగారు కూడా మా వెనక వచ్చేరు. గుడికి ఎదురుగా మాచెల్లి మళ్ళీ మోకరిల్లి ఉండిపోయేసరికి దాని భక్తి చూసి ఏం చెయ్యడమో అమ్మకీ నాకూ తెలియలేదు. బైరాగిగారు మాత్రం చెల్లి దగ్గిరికి వెళ్ళి దాన్ని అభిమానంగా నిమిరారు. అంతలో మా చుట్టూ చాల మంది జనం చేరేరు. మాచెల్లిలి భక్తికి బైరాగిగారి మహిమవల్ల కూడా మాచెల్లంత చిన్నదానికి కూడా భక్తి కుదిరిందని వాళ్ళు అనుకున్నట్టున్నారు.

బైరాగిగారు మమ్మల్ని తమ ఆశ్రమానికి తీసుకువెళ్ళి మా చెల్లినే కాకుండా మా అమ్మనీ నన్ను కూడా చాలా ఆదరించి అభిమానించి అక్కడ మా ముగ్గుర్ని ఉంచేరు. ఆయన ఆశ్రమం చాలా బాగుండేది. అక్కడ ఏ కొరతా లేకుండా మాకు చాలా హాయిగా వెళ్ళింది. మా చెల్లి భక్తి గురించి ఊరంతా చెప్పుకున్నట్టున్నారు. చాలామంది వచ్చి మాచెల్లిని చూసి దానికి దండం పెట్టుకు వెళ్ళనారంభించేరు. మాచెల్లికి రాజదర్శనం జరుగుతుందనీ రాజుగారితో సహా మాచెల్లికీ మాకూ దైవదర్శనం జరుగుతుందనీ మాకు తెలిసింది. అయితే ఈలోగా -

కరువు బాగా ముదిరింది. కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ మాకు ఆశ్రమంలో ఏలోటూ లేకపోనేమో! నదిలో నీరు పూర్తిగా ఎండిపోయింది. ఇసకలో గోతులు లోతుగా తవ్వుకొని జనం నీరు తెచ్చుకొంటూండేవారు. ఆశ్రమంలో కూడా నీటిని చాలా భద్రంగా దాచి ఉంచేవారు. ఊళ్ళో జనం చాలామంది జబ్బులవల్లా, తిండి లేకపోవడంవల్లా చనిపోతున్నారు. ఊరు విడిచి చాలామంది వెళ్ళిపోతున్నారు. అయినా కూడా ఆశ్రమంలో మేం హాయిగానే ఉన్నాం. మాకు అక్కడ దినాలు దివ్యంగా వెళ్ళేయి.

రాజుగారు ఏదో యుద్ధానికి వెళ్ళేరనీ, మరొక పక్షం దినాల్లో వస్తారనీ, ఆయన రాగానే మా చెల్లికీ, మాకూ రాజదర్శనం, దైవదర్శనం జరుగుతాయనీ మాకు తెలిసింది. పదిహేను

దినాలవలేదు. పది దినాలు అయేయి. అంతలో ఊరంతా గగ్గోలయిపోయింది.

ఇరవై కోసుల దూరంలో యుద్ధం జరిగిందట. అందులో రాజుగారే నెగ్గేరట కాని ఆయన అవతలూరి రాజుగారట. మావూరి రాజుగారు ఓడిపోయేరుట. ఆయన్ని అవతలూరి రాజు వేలొకసారీ, కాలొకసారీ కోయించి పూర్తిగా ఉంచక భాగంగా ఉంచి బాధిస్తున్నాడట. మరింక రేపో ఎల్లుండో ఆ రాజుగారు సైనికులు మేం ఉన్న ఊరుమీద పడతారట.

అంతా ఊరు విడిచి పారిపోనారంభించేరు. పారిపోయే జనాన్ని దొంగలు దోచుకోనారంభించేరు. అంతా చాలా ఘోరంగా ఉంది.

మా బైరాగిగారు ఆ రాత్రి ఆ వూరు విడిచి వెళ్ళిపోడానికి అంతా సిద్ధం చేస్తున్నారు.

శత్రురాజు వచ్చినప్పటికీ అతను బైరాగుల్ని బాధించడని కొందరు చిన్న బైరాగులు మా బైరాగిగారికి ధైర్యం చెప్పారు. కాని, ముందు ఊరు విడిచి వెళ్ళిపోయి. కొత్తరాజు ఎటువంటివాడో కనుక్కొని, మంచివాడైతే మనం మళ్ళీ ఊళ్ళోకి రావచ్చునని మా బైరాగిగారు అభిప్రాయపడ్డారు. ఆ రాజు మంచివాడే అయితే మా చెల్లికి దైవదర్శనం ఆయనతో పాటే చేయించవచ్చునని కూడా బైరాగిగారన్నారు. కొత్తరాజుగారి లోతుపాతులు కనిపెట్టేక మా చెల్లికి వింతభక్తిని ఆయనకి చూపించి ఆయన్ని పూర్తిగా వశం చేసుకోవచ్చునని మా బైరాగిగారన్నారు. ఈలోగా పలాయనమే మంచిదని ఆయన సెలవిచ్చేరు.

అర్థరాత్రయింది. మరొక ఝాము గడిచేక మేము ఊరు విడిచిపోవాలన్నమాట. ఈలోగా మా బైరాగిగార్ని దొంగలు చంపేసేరు. వాళ్ళు పదిమందున్నారు. ఈటెలూ, కత్తులూ పట్టుకొని వచ్చేరు. మా బైరాగిగారు వాళ్ళకి దండంపెట్టి, వాళ్ళ పాదాలు పట్టుకొని శరణువేడేరు. దేముడికైనా కనికరం కలగవచ్చునేమో కాని దొంగలకి మాత్రం కనికరం కలగలేదు. బైరాగిగారి మాటలకి వాళ్ళు వప్పుకోలేదు. "చూపించు చూపించు" అన్నారు. అప్పుడు మా బైరాగిగారు వాళ్ళని ఆశ్రమంలో ఓ చెట్టువారకి తీసుకువేళ్ళేరు. అక్కడ ఓ గొయ్యి తవ్వి అందులోంచి ఎన్నెన్నో బంగారపు వస్తువులు తీసేరు. దొంగలు అవన్నీ తీసుకొని బైరాగిగార్ని పొడిచి నరికి చంపి ఆ గోతిలోకే తోసేసి, కప్పనైనా కప్పకుండా వెళ్ళిపోయేరు.

మేం అదంతా మరో చెట్టువార నిక్కి నిలబడి చూసేం. దొంగలు వెళ్ళిపోగానే చెల్లి ఆ గోతి దగ్గరకి వెళ్ళబోయింది. కాని మా అమ్మ దాన్ని ఇవతలకు లాక్కొచ్చింది.

చెల్లీ, అమ్మా, నేనూ మళ్ళీ వీధిని పడ్డాం.

అర్థరాత్రి దాటింది ఆకాశంలో చంద్రుడు పాలిపోయున్నాడు. ఊళ్ళో మేడలన్నీ మూగ దెయ్యాల్లా నిల్చున్నాయి. ఊరు విడిచేసే జనం అంతా మూటలూ, సంచులూ మోసుకొని, పిల్లల్ని ఎత్తుకొని నడిపించుకొని వడివడిగా వెళ్ళిపోతున్నారు. కొంతమంది గొల్లున ఏడుస్తూ పరిగెడుతున్నారు. ఆ సమయంలో లోకం అంతా నాకు చాలా భయంకరంగా, గందరగోళంగా తోచింది. అడుగడుగునా, అణువణువునా మృత్యుభయం తప్ప ఈ లోకంలో మరేదీ ఉన్నట్టు నాకనిపించలేదు. ఆ సమయంలో నాకు ఆ చంద్రుడు కూడా చచ్చిన సూర్యుళ్ళా కనిపించేడు. అతని వెలుగు శవం నవ్వులా చాలా భయంకరంగా ఉంది.

మేం అంతా ఆ రాత్రివేళ వెళ్తూండగా మాకెదురుగా దారికి అడ్డుగా ఓ పెద్ద భూతం నిల్చుంది. దాన్ని అకస్మాత్తుగా చూడ్డంలో నేను చాలా ఎక్కువగా జడుసుకున్నాను. భూతంలా

ఉందది. కాని, ఆ వూరి గుడి గోపురం. పగటి వెలుగులో అది మనోహరంగానే తోచేది. దాన్ని అర్ధరాత్రి చూడ్డం నాకదే మొదటిసారి. వెన్నెల వెలుగునీడల్లో అది మఠం వేసుకూర్చుని నిద్రపోతున్న రక్కసి బైరాగిలా నాకు తోచింది. దాన్ని చూసి నాకు చాలా భయం వేసింది. ఆ గుళ్ళో దేముడు ఆ సమయంలో ఏం చేస్తున్నాడో కదా అని నాకో క్షణం అనిపించింది. ఊరు విడిచిపోయే జనం అంతా గుడిముందు ఆగి మొక్కి లెంపలేసుకొని వెళ్తున్నారు. దేముడు ఆ గుళ్ళో కూర్చుని ఏం చేసినప్పటికీ గుడి బైట ఏడ్చుకుపోయే జనానికి మాత్రం ఏమీ చెయ్యడని నాకెందుకోగాని ఆ సమయంలో స్పష్టంగా తెలిసింది.

కాని, మాచెల్లి మాత్రం ఆ గుడికి ఎదురుగా ధ్యానం చేస్తూ ఉండిపోయింది. వెన్నెల్లో తెల్లగా, జాలిగా నాకంటికది మూర్తీభవించిన పుణ్యంలా కనిపించింది. నాకు ఆ సమయంలో అనుకోకుండా కళ్ళంట నీళ్ళు తిరిగేయి. నేనప్పటికి చిన్నవాణ్నే అయినప్పటికీ మా చెల్లెలి పుణ్యమూ, దాని భక్తీ, దాని తపనా అంతా కూడా వృథా కదా అనిపించింది. కలలన్నీ నిజాలే ననుకొని వ్యవహరించే అమాయకుల్ని చూసి పెద్దవాళ్లు జాలిపడ్డట్టు మా చెల్లెల్ని చూసి నేను జాలిపడ్డాను. నాకు ఆ అర్ధరాత్రివేళ ఆ గుడికి ఎదురుగా మా చెల్లి పక్క నిల్చున్న సమయంలో మా నాన్న గుర్తుకొచ్చేడు. మా నాన్న కూడా మా బైరాగిగారు దొంగల్ని శరణువేడినట్టు భగవంతుణ్ణి శరణు వేడేఉంటాడు. పగటి పూటో, రాత్రివేళో ఎండలోనో నీడలోనో, ఎక్కడోగాని ఎప్పుడోగాని భగవంతుడి సమక్షంలోనే భగవంతుణ్ని స్మరిస్తూండగానే మానాన్నని నరికేసి ఉంటారు.

సరే మేం ఆ వూరు విడిచేం. సరే, మేం మళ్ళీ మా అడవి పట్టేం. ఒక దినం నెమ్మదిగా వెళ్ళింది. మరోదినం కష్టంమీద నడిచింది, మూడోదినం భయంకరంగా జరిగింది, నాలుగోదినం జరగలేదు. అది మిట్ట మధ్యాహ్నం దాకా పాములా కదలి కదలి అక్కడ దారుణంగా దుర్మార్గంగా పడగవిప్పి నిలబడిపోయింది.

ఎండ ఎండ ఎండ, అడవినిండా శవాలు శవాలు, ఎక్కడా చూసినా ఎముకలు ఎముకలు. అడవిలోని చెట్లన్నీ ఆకుల్లేని బొమికలు. ఎక్కడికి వెళ్ళినా దుర్గంధం.

ఎండా, దాహం, బాధా తప్ప మాకు లోకంలో మరేదీ లేదప్పుడు. ఎక్కడికి వెళ్ళాలి, ఏం చెయ్యాలి, ఎందుకు పుట్టేం, ఎందుకు చచ్చేం దేముడెవడు, ఏది దెయ్యం, ఎందుకు బతుకు? ఇటువంటి వాటి గురించి ఆలోచించే పరిస్థితిలో లేన్నేను. ఎండ ఎండ నీరు నీరు ఏది నీరు ఏది దారి? అంతే నాకిప్పుడు.

కళ్ళు మూసుకొని ఎలా నడవగలిగామో నాకు తెలియదు. కళ్లు తెరిచేసరికి మళ్ళీ అలనాటి ఏటిగట్టునే మేం ఉన్నాం.

మేం ముగ్గురం అలా నిలబడి ఏటివైపు ఆశగా చూశాం? ఏట్లో నీరులేదు, ఇసకే ఉంది. ఇసక నిండా శవాలూ, ఎముకలూ కనిపిస్తున్నాయి. చాలామట్టుకు అవి ఇసకలో కూరుకుపోయున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడా ప్రాణ చలనం లేదు.

ఆ మండే ఇసకలో మా ఆశలన్నీ మాడిపోయాయి. అక్కడ వరకూ జీవితంలో నడుచుకొచ్చిన మా అమ్మ అక్కడ ఆ ఇసకలో కుప్ప కూలిపోయింది. ఆ ఎర్రటి ఇసకమీద మా అమ్మ నల్లని శరీరం అరక్షణంలో అంటుకుపోయేట్టుంది. నా మనసు ఆ అడవిలాగా, ఇసకలాగా అయిపోయింది.

వెంటనే చెల్లీ, నేనూ ఆ ఏటిలో నీరుండాల్సిన వైపుకి పరిగెట్టాం అలవాటుమీద మేం ఆ ఆపదలో అటు వెళ్ళేం. అక్కడ నేను కూలబడిపోయాను. మాచెల్లి మాత్రం -

దేముడికి మొక్కింది, కాలే ఎండలో మండే, ఇసకలో చచ్చిన అడివికి చేరువలో, శవాల మధ్యలో మా చెల్లి తెల్లగా నిలబడి మెల్లగా వంగొని నీకోసం నాకోసం, అమ్మకోసం, అందరి కోసం నిర్మలంగా, నిశ్చలంగా తొందరగా తీవ్రంగా భగవంతుణ్ని ప్రార్థించింది.

దేముడు పలికేనా? సమాధానం వచ్చెనా? వర్షం కురిసేనా? జీవుడు బతికేనా?

అది అద్భుతమో ఏమిటో నేను చెప్పలేను కాని, మా చెల్లి అలా ప్రార్థించే సమయంలోనే ఏట్లో ఆవిర్లు పుట్టేయి. ఏ దూరాల్లోనో ఏ కొండల్లోనో మబ్బులన్నీ కట్టకట్టుకొని కిందకి దిగినట్టున్నాయి, ఏట్లోకి రానారంభించింది నీరు నీరు .... నీరు!!

నీటివాసన తెలియగానే నేను పరిగెట్టికెళ్లి మా అమ్మతో చెప్పేను మా అమ్మ నా మాట విన్నదనే అనుకున్నాను. నేను నీటివైపు మళ్ళీ తొందరగా పరిగెట్టేను. చెల్లి ఇంకా ధ్యానంలో ఉంది. నీరొచ్చిందే చెల్లీ అన్నాను. అది నామాట వినిపించుకోలేదు. నేను నాలుగు గుటకల నీరు తాగేను. నాలో అమృతమే ప్రవహించిందనుకున్నాను.

అంతే, మాచెల్లికి ఆ క్షణమే చివరి క్షణం! నేను పారిపోయేను. రాక్షసుడికి మాచెల్లి దొరికిపోయింది. ఆమెమీద కాలువేసి అదిమిపెట్టి, కడుపునిండా నీరుతాగి ఆమీదట ఆమెను అంకించుకుపోయేడు వాడు. మా అమ్మ నీరు తాగిందో లేదో నాకు తెలీదు, ఆమె ఏటి వరదలో కొట్టుకుపోయింది.

ఆ రాత్రి వర్షం పడింది. మావైపు లోకం చల్లారింది. ఆ దినం ఎందరెందరో భగవంతుడికి దండాలు పెట్టేరు. మాచెల్లీ అమ్మా మాత్రం ఆ నమస్కరించిన వాళ్ళల్లో లేరు. అయితేనేం ఒక చిన్న దండం తక్కువైతే దేముడికి లోటేమిటొచ్చింది!? పెద్దల నమస్కారాలు ఎన్నెన్నో అతనికున్నాయి కదా!

మా చెల్లీ అమ్మాపోయి చాలా దినాలయింది. రేపు నన్ను తీసుకు వెళ్తారు, అలనాడు మానాన్నని తీసుకువెళ్ళిననాడు తనను ఎందుకు తీసుకువెళ్తున్నారో, మా నాన్నకి ముందుగా తెలుసునో లేదో నాకు తెలియదు, కాని రేపు నన్నెందుకు తీసుకువెళ్తారో నాకు తెలుసు. రేపు నేనుండను. భగవంతుడుంటాడు కాని, అతను మనకి మనకోసం మనయెడల మన మంచికి ఉండడుండడు, ఉండడుకాక ఉండడు.

★ ★ ★

పై రెండు కథల్లోనూ మొదటిది ఎవరు చెప్పేరో రెండోది ఎవరు చెప్పేరో చాలామంది పాఠకులు గ్రహించే ఉంటారు. పూర్తిగా తెలుసుకోలేకపోయినప్పటికీ చాలామంది చాలామట్టుకు తెలుసుకునే ఉంటారు. చాలామంది ఈ కథ చదవరు, చదివినవారిలో కొంతమందికీ ఇటువంటి గెస్‌వర్కు చెయ్యటం ఇష్టం లేకపోవచ్చు. అది చాలా అనవసరం అని వారు అనుకోవచ్చు. (84వ పేజీ చూడండి)

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 17-4-1970*